క్లుప్తంగా

రైతు సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు



చర్లఅంకిరెడ్డిపల్లిలో కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కనకరాజు

చిన్నకోడూరు(సిద్దిపేట): రైతు సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని పీఏసీఎస్ చైర్మన్ ములకల కనకరాజు అన్నారు. మంగళవారం మండలంలోని చర్లఅంకిరెడ్డిపల్లిలో గంగాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులు కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. కొనుగోలు కేంద్రంలో మెరుగైన వసతులు కల్పించాలన్నారు. వడ్లను వెంట వెంటనే మిల్లులకు తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, అజ్జుయాదవ్ పాల్గొన్నారు.

సర్వీసులను పునరుద్ధరించండి

కామారెడ్డి బస్సు డిపో మేనేజర్‌కు వినతి



డిపో మేనేజర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఫోరం అధ్యక్షుడు శ్రీకాంత్

దుబ్బాకటౌన్: దుబ్బాక నుంచి వయా కొత్తపల్లి గ్రామం మీదుగా కామారెడ్డికి మూడు బస్సులను, దుబ్బాక నుంచి నిజామాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు నడపాలని దుబ్బాక డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులు కోరారు. మంగళవారం కామారెడ్డి బస్సు డిపో మేనేజర్ ఇందిరాకు వినతిపత్రం అందించారు. అనంతరం ఫోరం అధ్యక్షుడు మాడబోయిన శ్రీకాంత్ మాట్లాడారు. గతంలో కామారెడ్డి డిపో బస్సులు దుబ్బాక నుంచి కొత్తపల్లి మీదుగా కామారెడ్డికి నడిచేవన్నారు. దీంతో దుబ్బాక డిపో బస్సులు నడపడం లేదన్నారు. సర్వీసులు లేక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మాదిరిగా దుబ్బాక నుంచి కామారెడ్డి డిపో బస్సులు నడిపితే 20 గ్రామాల ప్రయాణికులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు.

పద్మశాలి రాష్ట్ర కమిటీలో జిల్లావాసులకు చోటు

సిద్దిపేటజోన్: పద్మశాలి రాష్ట్ర సంఘంలో జిల్లాకు చెందిన పలువురికి చోటు దక్కింది. రాష్ట్ర గౌరవ అధ్యక్షుడిగా సిద్దిపేట పట్టణానికి చెందిన బూర మల్లేశం నియమితులయ్యారు. ఉపాధ్యక్షుడిగా అడెపు బాలచందర్ (గజ్వేల్), రాష్ట్ర కార్యదర్శులుగా ముదిగొండ శ్రీనివాస్(సిద్దిపేట), చేర్యాల మల్లికార్జున్ (సిద్దిపేట), గాజుల తిరుపతి (దుబ్బాక), స్వర్గం రాజేశం (గజ్వేల్) సంయుక్త కార్యదర్శిగా భిక్షపతి (సిద్దిపేట)లను నియమించారు. ఈ మేరకు పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ సతీశ్, రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్‌లకు నియమితులైన వారు కృతజ్ఞతలు తెలిపారు.

మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించండి


పీఆర్‌టీయూ అభ్యర్థి మహేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న మహేందర్‌రెడ్డి

సిద్దిపేటఅర్బన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పీఆర్‌టీయూ అభ్యర్థి మహేందర్‌రెడ్డి కోరారు. మంగళవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులను కలిసి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థులకు సేవా కార్యక్రమాలే లక్ష్యంగా వీఎంఆర్ ఫౌండేషన్ ప్రారంభించి కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.

కుమ్మరగానే నమోదు చేయించుకోవాలి : చంద్రం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): కుల గణనలో జిల్లాలోని కుమ్మర్లు తమ వివరాలు నమోదు చేసుకునే సమయంలో కులం పేరును ప్రభుత్వ గెజిట్‌లో పేర్కొన్న విధంగా కుమ్మర గానే నమోదు చేయించుకోవాలని సిద్దిపేట జిల్లా కుమ్మరి సంఘం అసోసియేట్ అధ్యక్షుడు తరిగొప్పుల రామచంద్రం పేర్కొన్నారు. మంగళవారం సర్వే అధికారులు కులంకు సంబంధించిన వివరాలు అడిగినప్పుడు కుమ్మర అని మాత్రమే చెప్పాలన్నారు.

విద్యార్థుల మాక్ పోలింగ్

హుస్నాబాద్ పట్టణంలోని కేరళ హైస్కూల్‌లో మంగళవారం మాక్ పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో హెడ్ బాయ్, హెడ్ గర్ల్ ఎన్నుకోవడానికి ఎన్నికలు నిర్వహించారు. విద్యార్థులు ఐడెంటీ కార్డులతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బుర్ర రాజేందర్, పాఠశాల కరస్పాండెంట్ అల్లె శైలేందర్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. - హుస్నాబాద్



మాక్ పోలింగ్‌లో విద్యార్థినులు

యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

హరిప్రియ నగర్ కాలనీని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, సంబంధిత అధికార యంత్రాంగం సందర్శించింది. మంగళవారం మురుగు నీరు.. జనం బేజారు అనే కథనాన్ని సాక్షి దినపత్రిక ప్రచురించింది దీనికి స్పందించిన కమిషనర్ తదితరులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతు పనులు చేయించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. -సిద్దిపేటజోన్

సాక్షి ఎఫెక్ట్..



రగ్బీ పోటీలకు మోడల్ విద్యార్థులు

కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రస్థాయి రగ్బీ పోటీలకు మండలంలోని నాగసముద్రాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నర్సింహులు, పీఈటీ భరత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా చేగుంట.. మోడల్ స్కూల్‌లో జరిగిన రగ్బీ జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థులు ప్రతిభకనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. అండర్–17లో అందె తమన్, అండర్ –19లో మెదవేణి శ్రీచరణ్, అండర్–19లో మంద అర్పిత, ఎల్ల రక్షిత, ఎడబోయిన అనుష్కలు ఎంపికైనట్లు వెల్లడించారు. రాష్ట్రస్థాయి పోటీలను ఈనెల 15 నుంచి 19 వరకు హైదరాబాద్‌లో జరుగుతాయని తెలిపారు.



కోహెడరూరల్(హుస్నాబాద్): రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

నెట్‌బాల్ పోటీలకు...

గజ్వేల్: రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్స్ బాలబాలికల నెట్ బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్టును మంగళవారం గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లో ఎంపిక చేశారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన ఈ ఎంపికల్లో ఉమ్మడి జిల్లా పరిధిలోని 200మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎంపికైన వారు ఈనెల 8 నుంచి 10వరకు నిర్మల్‌లోని ఎన్‌టీఆర్ స్టేడియంలో జరగనున్న 7వ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని ఉమ్మడి జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయరేఖ తెలిపారు.

విద్యార్థులు ఎంపిక

జగదేవ్‌పూర్(గజ్వేల్): రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు తిగుల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనసూయ మంగళవారం తెలిపారు. సోమవారం ఉమ్మడి జిల్లా క్రీడా పోటీలు సంగారెడ్డిలో నిర్వహించారు. అండర్ 17 బాలికల ఖోఖో జిల్లా స్థాయి పోటీల్లో పాఠశాల విద్యార్థులు వంక వెన్నెల, బీడ స్రవంతి, సౌమ్య ప్రతిభ చాటి ఎంపికైనట్లు తెలిపారు. స్టాండ్ బై క్రీడాకారులుగా ఉన్న శివాని, పూజ, అనూషలు కూడా ఎంపికయ్యారని తెలిపారు. ఈ నెల 8న ఖమ్మం జిల్లా కల్లూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. వారిని పాఠశాల ఉపాధ్యాయుల బృందం, గ్రామ మాజీ ప్రజాప్రతినిధులు విద్యార్థులను అభినందించారు.

హ్యాండ్ బాల్ క్రీడా పోటీలకు..

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో బుధవారం అండర్–19 బాలబాలికలకు హ్యాండ్ పోటీలకు ఎంపిక నిర్వహించనున్నట్లు ఫిజికల్ డైరెక్టర్ దామెర ప్రేమ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటల నుంచి ఎంపికలుంటాయని ఆసక్తి గల విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్‌తో హాజరుకావాలని సూచించారు. వివరాలకు 90009–97100 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయుల బృందం

నాగపురి విద్యార్థిని..

చేర్యాల(సిద్దిపేట): మండలంలోని నాగపురి జెడ్పీహెచ్ఎస్ 9వ తరగతి విద్యార్థిని కె.మౌనిక పరుగు పందెంలో రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. జిల్లా కేంద్రంలో జరిగిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో బాలికల విభాగం అండర్–17 400 మీటర్ల పరుగు పందెంలో రెండవ బహుమతి సాధించింది. ఆ మేరకు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం అయిలయ్య తెలిపారు. మౌనికను పీడీ శ్రీధర్‌ని ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

● సమస్యలు పరిష్కరించాలని.. సీతక్కకు వినతి



సమస్యలను పరిష్కరించాలని జిల్లా హాస్టల్స్ వార్డెన్ అధికారులు కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి సీతక్కను కలిసి వినతపత్రం అందజేశారు. అనంతరం తెలంగాణ గిరిజన సంక్షేమ అధికారుల సంఘం ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. - సిద్దిపేటజోన్

మెడిసిన్ ఓవర్ డోస్ తీసుకుని మహిళ మృతి

చిన్నకోడూరు(సిద్దిపేట): మెడిసిన్స్ ఓవర్ డోస్ తీసుకుని మహిళ చనిపోయిన ఈ సంఘటన చిన్నకోడూరులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాగుల నర్సవ్వ(61)కు భర్త, కుమారుడు ఉన్నారు. ఆమెకు బీపీ, షుగర్ వ్యాధులు ఉండటంతో రోజూ మాత్రలు వేసుకుంటుంది. ఇటీవల కంటి చూపు మందగించింది. ఆదివారం రాత్రి బీపీ, షుగర్ మాత్రలు వేసుకుని పడుకుంది. విషయం మర్చిపోయి ఒకసారి, అర్ధరాత్రి ఇంకోసారి, మంగళవారం ఉదయం మరోసారి మందు బిళ్లలు వేసుకుంది. దీంతో అపస్మారక స్థితిలోకి చేరుకున్న ఆమెను కుటుంబీకులు సిద్దిపేట ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. నర్సవ్వ కుమారుడు మల్లేశం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ప్రత్యేక బస్సుల చార్జీల తగ్గింపు

గజ్వేల్‌రూరల్: కార్తీక మాసం పురస్కరించుకొని పుణ్యక్షేత్రాలు, వివాహ, విహారయాత్రలకు అద్దె ప్రాతిపదికన తీసుకు వెళ్లే ఆర్టీసీ ప్రత్యేక బస్సు చార్జీలను తగ్గిస్తున్నట్లు జీపీపీ (గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో మేనేజర్ పవన్ తెలిపారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ జీపీపీ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్సులను అద్దె ప్రాతిపదికన పుణ్యక్షేత్రాలు, వివాహ, విహారయాత్రలకు అందజేస్తున్నామన్నారు. గతంలో ఉన్న ధరలతో పోల్చితే కిలోమీటరుపై పల్లె వెలుగు బస్సుకు రూ.11, ఎక్స్‌ప్రెస్ బస్సుకు రూ.7 చొప్పున చార్జీలను తగ్గించామన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పోరాటంలో సీపీఎం ముందంజ

పార్టీ జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రజా పోరాటంలో సీపీఎం ముందుంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని దుద్దెడలో మంగళవారం పార్టీ మండల మూడవ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అధికారం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి మోసం చేస్తున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో సీపీఎం ఎప్పుడూ ముందుండి పోరాడుతుందన్నారు. నాటి నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఎన్నో ఇబ్బందులకు ఓర్చి పోరాడిన విషయాన్ని గుర్తు చేశారు. కార్మికుల, కర్షకుల ఇబ్బందులను కేంద్ర సర్కార్ పక్కన బెట్టి కార్పొరెట్ శక్తులకు అనుకూలంగా విధానాలను అమలు చేస్తోందన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మతోన్మాదాన్ని రెచ్చగొడుతోందన్నారు. దేశంలో ఉన్న బూర్జువా పార్టీలను పక్కన పెట్టినప్పుడే కార్మికవర్గానికి న్యాయం జరుగుతుందన్నారు. తపాస్‌పల్లి, మల్లన్న రిజర్వాయర్ నుంచి మండలవ్యాప్తంగా సాగు నీటి సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. త్వరలో జరిగే జిల్లా మహా సభలు విజయవంతం అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి బాల్‌నర్సయ్య, నాయకులు శశిధర్, అరుణ్‌కుమార్, కనకాచారి, నాగరాజు, రవీంద్రచారి, భారతి, కళావతి తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

పోరాటాల ఫలితమే డైట్ చార్జీల పెంపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేరిపోతుల జనార్దన్ అన్నారు. మంగళవారం ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ప్రభుత్వం సంక్షేమ హాస్టల్లో విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచిన నేపథ్యంలో సంక్షేమ వసతి గృహ అధికారులు సక్రమంగా మెనూ పాటించాలన్నారు. ఎన్నో ఏళ్లుగా విద్యార్థి సంఘాల పోరాటాలు, త్యాగాలతోనే మెస్, కాస్మోటిక్, మెస్ చార్జీలు పెంచిందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కొంతమంది వసతిగృహాధికారులు సక్రమంగా నిర్వహించడం లేదని, వసతి గృహానికి సరిగా రావడం లేదని ఆరోపించారు. గైర్హాజరైన విద్యార్థులు హాజరైనట్లు తప్పుడు లెక్కలు చూపిస్తూ, హాస్టళ్లలో అక్రమాలకు పాల్పడే అధికారులపై ఉన్నతస్థాయి అధికారులు దృష్టి సారించాలన్నారు. ఈ నెల చివరి వారంలో సిద్దిపేట జిల్లావ్యాప్తంగా ఉన్న సంక్షేమ వసతి గృహాలను సందర్శిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు, జిల్లా సహాయ కార్యదర్శి వేల్పుల ప్రసన్న కుమార్, జిల్లా నాయకులు జక్కుల అనిరుధ్, బాణోత్ నవీన్, యాసీన్, శ్రావణ్, తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్

రూపాయికే 5 లక్షల బీమా కల్పిస్తాం

- పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఆశీర్వదించండి
- కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్

హుస్నాబాద్: కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్, వరంగల్ జిల్లాలోని పట్టభద్రులు అందరితో పాటుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉపాధ్యాయులకు రూ.1కే రూ.5లక్షల ప్రమాదబీమా చేయిస్తానని కరీంనగర్ మాజీ మేయర్ రవీందర్ సింగ్ హామీనిచ్చారు. మంగళవారం పట్టణంలోని అపోలో ఒకేషన్ జూనియర్ కళాశాలలో ప్రైవేట్ ఉపాధ్యాయులు, పట్టభద్రులతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తాను కరీంనగర్ మేయర్‌గా ఉన్నప్పుడు రూపాయికే నల్లా కనెక్షన్, అంత్యక్రియల కార్యక్రమాలకు శ్రీకారం చుట్టానని గుర్తుచేశారు. వచ్చే ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీలో దిగుతున్నానని ఆశీర్వదించాలని కోరారు.



మాట్లాడుతున్న మాజీ మేయర్ రవీందర్ సింగ్

నామ్‌కే వాస్తేగా 'రైతు నేస్తం' కార్యక్రమం

- రైతుల మేలుకొలుపులో అధికారులు విఫలం
- అధిక సంఖ్యలో హాజరైన ఫర్టిలైజర్స్ యజమానులు

కోహెడ(హుస్నాబాద్): కోహెడ రైతు వేదిక కార్యాలయంలో మంగళవారం 'రైతు నేస్తం' కార్యక్రమం వ్యవసాయ అధికారులు తూతూమంత్రంగా నిర్వహించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంటల సాగులో తెగుళ్లు, కలుపు నివారణ, వివిధ పురుగుల నివారణపై రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య పద్ధతుల గురించి క్లుప్తంగా వివరించారు. కార్యక్రమానికి ఏఈఓ, మండల విస్తరణ అధికారులు రైతులను జాగృతం చేయడంలో విఫలమయ్యారు. వారికి బదులుగా అధిక సంఖ్యలో ఫర్టిలైజర్ యాజమానులు హాజరయ్యారు. ప్రతీమంగళవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి ఈసారి జిల్లా వ్యవసాయ అధికారి రాధిక విచ్చేశారు. కనీసం రైతులు ఎక్కడని గానీ, వారికి అసలు సమాచారం ఇచ్చారా? అని కూడా మండలాధికారులను అడిగింది లేదు. ఇలాంటి కార్యక్రమాలు అధికారులు నామ్‌కే వాస్తేగా నిర్వహిస్తున్నట్లు ఆరోపణలు లేకపోలేదు.



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఫర్టిలైజర్ షాపుల నిర్వాహకులు

నిబంధనలు పాటించి వాహనాలు నడపాలి

సీఐలు ఉపేందర్, ప్రవీణ్‌కుమార్

సిద్దిపేటకమాన్: వాహనదారులు ట్రాఫిక్, రోడ్డు నిబంధనలు పాటించి వాహనాలను నడపాలని సిద్దిపేట టూటౌన్ సీఐ ఉపేందర్, ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. సిద్దిపేట పట్టణ శివారులో రాజీవ్ రహదారిపై తరచుగా ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలను వారు మంగళవారం సందర్శించి పరిశీలించి వారు మాట్లాడారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి ముందస్తు చర్యలు తీసుకుంటామన్నారు. అధిక వేగం, మానవ తప్పిదం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలను నడపకూడదన్నారు. థర్మో ప్లాస్టిక్ పెయింట్స్, హజార్డ్ మార్కర్, రేడియం స్టెడ్స్, బ్రింగ్ లెటర్స్, సైనింగ్ బోర్డ్స్, వేగ నియంత్రణ బోర్డులను ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు వెంకట్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐలు ఉమేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాద ప్రాంతాలను పరిశీలిస్తున్న సీఐలు ఉపేందర్, ప్రవీణ్‌కుమార్

సంక్షిప్త వార్తలు

◆ నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోహెడరూరల్(హుస్నాబాద్): మండలంలోని సముద్రాలలో ఎల్కతుర్తి–సిద్దిపేట రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం గ్రామ పంచాయతీ దగ్గరలో 11 కేవీ, ఎల్‌టీలైన్ షిఫ్టింగ్ పనులు జరుగుతున్నాయని బస్వాపూర్ ఏఈ మనోజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 11 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. వినియోగదారులందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

◆ ఉద్యోగ జీవితంలో బదిలీ తప్పనిసరి

మద్దూరు(హుస్నాబాద్): ఉద్యోగ జీవితంలో బదిలీ అనేది తప్పనిసరి అని మనం ఎక్కడ సేవలు అందించినా విద్యార్థుల సమగ్ర వికాసానికి తోడ్పాలని ఎంఈఓ వరదరాజు అన్నారు. మండలంలోని వల్లంపట్లలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులు బాల్‌రెడ్డి, భాస్కర్, రాంరెడ్డిలకు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఫాతిమారాణి, మాజీ సర్పంచ్ ఆలేటి రజితయాదగిరి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

◆ మల్లన్న ఆలయానికి విరాళం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లన్న ఆలయానికి సిద్దిపేటకు చెందిన చింతల చంద్రహాస్, మాధవి దంపతులు మంగళవారం స్వామి వారి నిత్యాన్నదానానికి రూ1,10,232, శాశ్వత కల్యాణానికి రూ.5,016, శాశ్వత పూజకు రూ.1,116లు విరాళంగా అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయంలో త్వరలో దాతల సహకారంతో నిర్మించే వసతుల గదులలో రెండు తాము నిర్మిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు మహదేవుని మల్లికార్జున్, ఏఈఓ బుద్ధి శ్రీనివాస్, పర్యవేక్షకులు శ్రీరాములు, సురేందర్‌రెడ్డి, అర్చకులు మనోహర్ పాల్గొన్నారు.

◆ ఎన్ఎస్ఎస్ శిబిరం విజయవంతం

సిద్దిపేటఅర్బన్: ఇందూరు ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మండలంలోని మిట్టపల్లిలో వారం రోజుల పాటు నిర్వహించిన శిబిరం మంగళవారం ముగిసింది. వారం రోజుల పాటు గ్రామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీపీ రాజు తెలిపారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఇంటింటి సర్వే, మద్యపానం వల్ల జరిగే నష్టాలను గ్రామస్తులకు తెలిపినట్లు చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో పౌష్టికాహారానికి సంబంధించి విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. మెడికల్ క్యాంపు, స్వచ్ఛ భారత్ ప్రోగ్రాం, నీటి ప్రాముఖ్యత గురించి వివరించినట్లు తెలిపారు. చివరి రోజు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ రాంచంద్రం, పీఆర్వో రఘు, వలంటీర్లు పాల్గొన్నారు.

◆ విద్యార్థులను ప్రోత్సహించండి

మిరుదొడ్డి(దుబ్బాక): జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించే చెకుముకి టాలెంట్ టెస్టుల్లో 8, 9, 10వ విద్యార్థులు పాల్గొనేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని ఎంఈఓ దోమకొండ అంజయ్య కోరారు. అక్బర్‌పేట–భూంపల్లి మండల వనరుల కేంద్రంలో చెకుముకి టాలెంట్ టెస్టు పోస్టర్లను టీచర్లతో కలిసి ఆయన మంగళవారం ఆవిష్కరించారు. జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈనెల 7న పాఠశాలస్థాయి, 21న మండలస్థాయి, 28న జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయిలో డిసెంబర్ 14 నుంచి 16 వరకు విద్యార్థులకు టాలెంట్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

◆ చిన్నారికి 'భరోసా'



గజ్వేల్‌రూరల్: కాలేయ వ్యాధితో బాధపడుతున్న ఓ చిన్నారికి గజ్వేల్‌కు చెందిన భరోసా ఫౌండేషన్ అండగా నిలిచింది. కోహెడ మండలం శ్రీరాములపల్లికి చెందిన శిరీష–రాజశేఖర్ దంపతుల కూతురు రియాన్షిక కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న విషయం తెలుసుకున్న గజ్వేల్‌కు చెందిన భరోసా ఫౌండేషన్ సభ్యులు చలించిపోయారు. చిన్నారి వైద్య చికిత్సల కోసం సుమారు రూ. 35 లక్షలు ఖర్చవుతుందని తెలుసుకొని మంగళవారం తమ వంతుగా రూ.30 వేల సాయం అందజేశారు.

◆ అపార్‌తో విద్యార్థులకు లబ్ధి

సిద్దిపేట ఎడ్యుకేషన్: జాతీయ నూతన విద్యావిధానం ద్వారా తీసుకొచ్చిన అపార్‌తో విద్యార్థులకు లబ్ధి చేకురుతుందని, సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాణి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నూతన విద్యా విధానం 2020లో భాగంగా అపార్ ప్రాముఖ్యత, ఉపయోగాల గురించి తల్లిదండ్రులకు వివరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ కళాశాల పట్ల, అధ్యాపకుల కృషి పట్ల నమ్మకంతో ఉన్నామన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రతీ విషయంలో అధ్యాపకులకు సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మ, వనజ, వందన, ఫరీద, రమాదేవి, శ్రీనివాస్, లక్ష్మీప్రసాద్, హుస్నా, రూప, శారద, సబిత, అర్చన, అజీమ, అన్సర్, రాజు, అజీమ్, నేహ, ఆయేషా, జాహేద, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

◆ సీసీఐ కేంద్రాల్లోనే పత్తి విక్రయించండి



బెజ్జంకి(సిద్దిపేట): రైతులు పత్తిని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ అన్నారు. మండలంలోని ముత్తన్నపేట శివారులో గల మణికంఠ కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, డైరెక్టర్‌లు నర్సయ్య, మౌనిక, నాయకులు రాజు, శ్రీను, రాజు, సత్యం, శంకర్, సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.